సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
I
శుక్రవారం । 13 । జనవరి । 2023


కొత్తగూడెంలో జరిగిన సీఎం కేసీఆర్ సభకు హాజరైన ప్రజలు

ప్రజలకు మేలు చేసే దేవాలయం కావాలి


మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, చిత్రంలో మంత్రి పువ్వాడ, సీఎస్ శాంతికుమారి, ఎంపీలు నామ, కవిత, ఎమ్మెల్యేలు వనమా, హరిప్రియ, మెచ్చా, మాజీ మంత్రి తుమ్మల

అన్ని కలెక్టరేట్లలోకి ఎత్తయిన ఎలివేషన్ ఈ భవనం సొంతం

- త్వరలోనే సీతారామ ప్రాజెక్టు పూర్తి చేస్తాం
- ఇంజనీరింగ్ కాలేజీలో సమస్యలు పరిష్కరిస్తాం
- నాలుగు మున్సిపాలిటీలకు రూ.130 కోట్లు
- ఖమ్మం నుంచే బీఆర్ఎస్ కార్యాచరణ
- కొత్తగూడెం సభలో సీఎం కేసీఆర్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: నూతనంగా ప్రారంభించుకున్న సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్) ప్రజలకు మేలు చేసే దేవాలయం కావాలని సీఎం కేసీఆర్ ఆకాంక్షించారు. నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవం సందర్భంగా జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులకు అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో ఏ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయానికి లేని ఎలివేషన్ భద్రాద్రి జిల్లాకు సొంతమని ప్రశంసించారు. కలెక్టరేట్ ప్రారంభం అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేసీఆర్ మాట్లాడారు. కొత్తగూడేనికి కలెక్టరేట్, మెడికల్ కాలేజీ, బీటీపీఎస్ ఇలా అనేకం వచ్చాయి. రాబోయే రోజుల్లో మరిన్ని వస్తాయని అన్నారు. సింగరేణి సంస్థ ఇల్లెందులో పుట్టి కొత్తగూడెం ద్వారా నలుదిశలా వ్యాపించి తెలంగాణ సిరుల పంటగా, ఉపాధి కల్పించే వనరుగా మారిందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రతీ ఇంచుకు నీరందించేలా సీతారామ ప్రాజెక్టు చేపట్టామన్నారు. ఇది పూర్తయితే కరువు ఉండే జూలూరుపాడు, ఎత్తులో ఉండే ఇల్లెందుకూ సాగునీరు అందివ్వడం సాధ్యమవుతుందన్నారు. నాగార్జునసాగర్ ఆయకట్టుకు ఢోకా ఉండదన్నారు.

భారీగా నిధులు..

జిల్లాలో 481 గ్రామ పంచాయతీలు ఉన్నాయని, ప్రతీ పంచాయతీకి సీఎం ప్రత్యేక నిధుల నుంచి రూ.10 లక్షల చొప్పున మంజూరు చేస్తున్నామని కేసీఆర్ ప్రకటించారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలని సర్పంచ్‌లకు సూచించారు. జిల్లా కేంద్రంలో భాగమైన పాల్వంచ, కొత్తగూడెం మున్సిపాలిటీలకు రూ.40 కోట్ల చొప్పున, ఇల్లెందు, మణుగూరు మున్సిపాలిటీలకు రూ. 25 కోట్ల వంతున నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు.

హామీల వర్షం..

కొత్తగూడెంలోని మైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను ఇంజనీరింగ్ కాలేజీగా మార్చినా అక్కడ సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయనే అంశం తన దృష్టికి వచ్చిందని, త్వరలోనే ఇంజనీరింగ్ కాలేజీకి అన్ని వసతులతో కూడిన హాస్టల్, తరగతి గదులు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని, అధ్యాపకులను నియమిస్తామని కేసీఆర్ హామీ ఇచ్చారు. భద్రాచలం వద్ద గోదావరికి ఎగువ ప్రాంతంలో ఉన్న గ్రామాలకు 3 ఫేజ్ పవర్ రావడం లేదనే విషయం తన దృష్టికి వచ్చిందని, గత సీఎస్ సోమేశ్ కుమార్ ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి పనులు చేయించారని, అవి చివరి దశకు చేరుకున్నాయని తెలిపారు. ముర్రేడు వాగు కోత కారణంగా తలెత్తుతున్న ఇబ్బందులను స్థానిక ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు తన దృష్టికి తీసుకొచ్చారని, ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు పది రోజుల్లోనే నిపుణుల కమిటీని పంపిస్తామని చెప్పారు. జిల్లా కేంద్రంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సింగరేణి సీఎండీ, జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేస్తామని సీఎం ప్రకటించారు. వీటితో పాటు జిల్లా అభివృద్ధికి ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఇచ్చిన వినతులను పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

కేసీఆర్ సంస్కరణల ఫలితమే : పువ్వాడ

కేసీఆర్ సంస్కరణ ఫలితంగానే కొత్త జిల్లాలు, కొత్త కలెక్టరేట్‌లు వచ్చాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. సులువుగా అందరికీ ఉపయోగపడేలా జిల్లాలను కేసీఆర్ విభజించారని వెల్లడించారు. కేసీఆర్ సంకల్పం వల్లే సీతారామ ప్రాజెక్టు కార్యరూపం దాల్చిందన్నారు. కొత్త మెడికల్ కాలేజీలు మంజూరు చేసినందుకు, పోడు భూముల సమస్యకు పరిష్కారం చూపించబోతున్నందుకు కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై పాల్వంచ – కొత్తగూడెం జంట పట్టణాలుగా అభివృద్ధి చెందబోతున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి మాట్లాడుతూ.. భద్రాద్రి జిల్లా కలెక్టరేట్ ప్రారంభోత్సవంలో భాగమైనందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యాలయం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని ప్రభుత్వ అధికారుల తరఫున హామీ ఇస్తున్నట్టు ఆమె వెల్లడించారు.

కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరావు మాట్లాడుతూ తెలంగాణ బాపూజీ కేసీఆర్ కొత్తగూడెం రావడం సంతోషంగా ఉందన్నారు. కొత్తగూడెం – పాల్వంచ మున్సిపాలిటీలకు రూ.300 కోట్లు, ముర్రేడు వాగు కోత సమస్య పరిష్కారానికి రూ.120 కోట్లు, కొత్తగూడెం మున్సిపాలిటీకి ప్రత్యేకంగా రూ.150 కోట్లు, పాల్వంచ మినీ ట్యాంక్‌బండ్‌కు రూ.12 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. దీంతో పాటు కొత్తగూడెంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, మాలోతు కవిత, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వరరెడ్డి, తాతా మధుసూదన్, ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, రాములు నాయక్, హరిప్రియ, మెచ్చా నాగేశ్వరరావు, బాల్క సుమన్, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీఎంఓ సెక్రటరీ స్మితా సబర్వాల్, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్సీలు బాలసాని లక్ష్మీనారాయణ, పూల రవీందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డి.రాజేందర్, డీసీసీబీ చైర్మన్ కె.నాగభూషణం, ఆర్అండ్‌బీ ఈఎన్సీ గణపతి రెడ్డి, నిర్మాణ సలహాదారు సుద్దాల సుధాకర్ తేజ పాల్గొన్నారు.

'గూడెం'లో 1.33 గంటలు

చుంచుపల్లి: సీఎం కేసీఆర్ గురువారం కొత్తగూడెంలో 1.33 గంటల పాటు గడిపారు. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 1.55 నిమిషాలకు రావాల్సి ఉండగా గంటన్నర ఆలస్యంగా వచ్చారు.

- 3:24 గంటలకు కొత్తగూడెం నూతన కలెక్టరేట్‌లో హెలికాప్టర్ ల్యాండ్ అయింది.
- 3:25కు హెలికాప్టర్ నుంచి దిగిన సీఎంకు మంత్రి పువ్వాడ, ఎంపీలు నామ, వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి తుమ్మల, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్మన్, కలెక్టర్, ఎస్పీ కేసీఆర్‌కు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.
- 3:28కి హెలీప్యాడ్ నుంచి నూతన కలెక్టరేట్ భవన సముదాయానికి బస్సులో బయలుదేరారు.
- 3:30కి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.
- 3:32కు నూతన కలెక్టరేట్ ప్రాంగణంలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి నిర్వహించిన పూజలో పాల్గొన్నారు.
- 3:34కు నూతన కలెక్టరేట్ భవన సముదాయాల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.
- 3:35కు రిబ్బన్ కట్ చేసి కార్యాలయంలోకి ప్రవేశించి లిఫ్ట్ ద్వారా కలెక్టర్ చాంబర్‌కు వెళ్లారు.
- 3:44కు కలెక్టర్ అనుదీప్‌ను కుర్చీలో కూర్చోబెట్టి అభినందనలు తెలిపారు.
- 3:45కు కలెక్టర్ అనుదీప్ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు జ్ఞాపిక బహూకరించి సన్మానం చేశారు.
- 3:50కి కలెక్టర్ కార్యాలయం నుంచి బస్సు ద్వారా స్టేజీ వద్దకు వచ్చారు.
- 3:52కు స్టేజీ పైకి చేరుకుని అభివాదం చేశారు. మొదట ఎమ్మెల్యే వనమా, తర్వాత చీఫ్ సెక్రటరీ, అనంతరం మంత్రి పువ్వాడ ప్రసంగించారు.
- 4:03 నుంచి 4.28 వరకు సీఎం కేసీఆర్ ప్రసంగించారు.
- 4:30కు బీఆర్ఎస్ భవనం ప్రారంభించేందుకు బస్సులో కొత్తగూడెం బయలుదేరారు.
- 4:42కు బీఆర్ఎస్ భవన్‌కు చేరుకున్నారు.
- 4:44కు పార్టీ కార్యాలయంలో జెండా ఎగురవేశారు.
- 4:45కు బీఆర్ఎస్ భవన ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.
- 4:47కు జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావును కుర్చీలో కూర్చోబెట్టి అభినందనలు తెలిపారు.
- 4:49కి పార్టీ కార్యాలయంలో సీఎం రెండు నిమిషాలు ప్రసంగించారు.
- 4:52 కు బీఆర్ఎస్ కార్యాలయం నుంచి ప్రకాశం స్టేడియానికి బయలుదేరారు.
- 4:57కు ప్రకాశం స్టేడియం నుంచి హెలికాప్టర్ ద్వారా హైదరాబాద్‌కు బయలుదేరారు.

యువకుడిలా వనమా


కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న వనమా

కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరావు అసెంబ్లీలోనే అత్యంత సీనియర్ ఎమ్మెల్యే అని సీఎం కేసీఆర్ అన్నారు. సీనియర్, వయసులో పెద్దవారైనా నియోజకవర్గ అభివృద్ధి కోసం యువకుడిలా పని చేస్తారని చెప్పారు. ఎప్పుడు హైదరాబాద్ వచ్చినా కొత్తగూడెం అభివృద్ధి కోసం మాట్లాడుతారన్నారు.

ఇక్కడి నుంచే మొదలు..

ఉద్యమ సమయంలో తనను అరెస్టు చేసి జైలుకు తీసుకెళ్తుంటే ఖమ్మం ప్రజలే కాపాడి కడుపున పెట్టుకున్నారని సీఎం కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. కమ్యూనిస్టు విప్లవాలు, రాజకీయ క్రియాశీలత ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బాగా విస్తరించాయన్నారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఒక దీపం మరో దీపాన్ని వెలిగించినట్టు, ఇక్కడి నుంచే చైతన్యం వెల్లివిరియాలని పిలుపునిచ్చారు. అందుకే దేశం మొత్తం బాగుండాలనే లక్ష్యంతో ఖమ్మం నుంచే బీఆర్ఎస్ కార్యాచరణ ప్రారంభిస్తున్నామని తెలిపారు.

కుర్చీలో కూర్చోబెట్టి


కలెక్టర్‌ను కుర్చీలో కూర్చోబెడుతున్న సీఎం

నిర్మాణ పనులు పూర్తయి చాన్నాళ్లుగా ఎదురు చూస్తున్న కలెక్టరేట్‌ను సీఎం కేసీఆర్ గురువారం ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ చాంబర్‌లో పూజలు నిర్వహించారు. కలెక్టర్ అనుదీప్‌ను కుర్చీలో కూర్చోబెట్టి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు కలెక్టర్ జ్ఞాపిక అందించారు. ఆ తర్వాత రోడ్డు మార్గంలో వెళ్లి నూతనంగా నిర్మించిన బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, విప్ రేగా కాంతారావును కుర్చీలో కూర్చోబెట్టి అభినందించారు. జిల్లా అధ్యక్షుడిగా పని చేసే అవకాశం కల్పించినందుకు సీఎం కేసీఆర్‌కు రేగా కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం పర్యటన సక్సెస్..

బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్..

సీఎం కేసీఆర్ జిల్లా పర్యటన విజయవంతం కావడంతో బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం నెలకొంది. ఆది నుంచీ జిల్లాలో బీఆర్ఎస్‌కు ప్రతికూల ఫలితాలే వస్తున్నాయి. దీనికి తోడు ఇటీవల పార్టీలో అసమ్మతి నేతలు స్వరం పెంచారు. ఈ సమయంలోనే సీఎం జిల్లా పర్యటన ఖరారైంది. తక్కువ సమయం ఉండడంతో ఈ టూర్ ఎలా జరుగుతుందోననే ఉత్కంఠ పార్టీ వర్గాల్లో నెలకొంది. అయితే ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పార్టీ పరంగా నేతలంతా ఒక్కతాటిపై నిలబడటంతో సీఎం పర్యటన విజయవంతం అయింది. మాజీ మంత్రి తుమ్మల సైతం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం గులాబీ రంగును పులుముకుంది. జాతీయ రాజకీయాల్లో బీఆర్ఎస్ ప్రవేశానికి సూచికగా ఈనెల 18న ఖమ్మంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. ఆ సభకు ఆరు రోజుల ముందు కొత్తగూడెంలో జరిగిన సభ సక్సెస్ కావడం బీఆర్ఎస్‌కు సానుకూలంగా మారింది. కాగా, హెలిప్యాడ్ దగ్గర సీఎం కేసీఆర్‌కు వీడ్కోలు పలికే సందర్భంలో 'వనమా.. ఇరగదీశావ్' అంటూ కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావును ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రశంసించారు.

దశదిశలా విస్తరింపజేయాలి

- దేశానికే వెలుగులు నింపేలా బీఆర్ఎస్ ఎదగాలి
- జిల్లా పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో సీఎం కేసీఆర్
- రేగా కాంతారావును సీటులో కూర్చోబెట్టి అభినందన


బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సీఎం కేసీఆర్, పక్కన మంత్రి పువ్వాడ, రేగా, వనమా

సూపర్‌బజార్(కొత్తగూడెం): దేశానికే వెలుగులు నింపే దిశగా బీఆర్ఎస్‌ను దశదిశలా విస్తరింపజేయాలని పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. కలెక్టరేట్ ప్రారంభోత్సవం అనంతరం రోడ్డు మార్గంలో పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. మొదట తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావును సీట్లో కూర్చోబెట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సభలో కేసీఆర్ మాట్లాడుతూ.. జిల్లాలోని నాయకులందరినీ కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా పార్టీ కార్యకలాపాలన్నీ ఇక ఇక్కడి నుంచే నిర్వహించాలని సూచించారు. ప్రజలకు, పార్టీ కార్యకర్తలందరికీ అందుబాటులో ఉండేందుకే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పార్టీ కార్యాలయాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. నాయకులు కార్యకర్తలకు అందుబాటులో ఉండి వారి కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, జిల్లా పార్టీ అధ్యక్షుడు రేగా కాంతారావు, రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, హరిప్రియ, మెచ్చా నాగేశ్వరరావు, ఎంపీలు నామా నాగేశ్వరరావు, మాలోత్ కవిత, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, తాతా మధుసూదన్, జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ దిండిగాల రాజేందర్ పాల్గొన్నారు.

పాసులు ఉన్నా అనుమతి నిరాకరణ..

బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం ప్రారంభోత్సం సందర్భంగా ముందుగానే జిల్లాలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులకు పాసులు జారీ చేశారు. పాసులతో పాటు పోలీసులకు లిస్ట్ కూడా అందించారు. అయితే పాస్ ఉన్నప్పటికీ జాబితాలో పేరు లేదంటూ చాలా మందిని లోపలికి అనుమతించలేదు. దీంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరాశగా వెనుదిరిగారు. బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలోకి మొత్తం 480 మందిని మాత్రమే అనుమతించారు. చివరకు పాత్రికేయులను సైతం లోనికి పంపించకుండా పక్కనున్న ఓ పాఠశాలలోకి తరలించారు.

9 నిమిషాలే..

బీఆర్ఎస్ కార్యాలయ ప్రారంభ ప్రక్రియ మొత్తం 9 నిమిషాల్లోనే పూర్తి కావడం విశేషం. సాయంత్రం 4.45 గంటలకు పార్టీ కార్యాలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి 4.54 వరకు పూర్తి చేసుకుని ప్రకాశం స్టేడియంలో ఉన్న హెలీప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి 5.08 గంటలకు హెలిక్యాప్టర్‌లో హైదరాబాద్‌కు బయలుదేరారు.

జిల్లాకు 42,600 కంటి అద్దాలు

చుంచుపల్లి: ఈనెల 18 నుంచి చేపట్టనున్న రెండో విడత కంటి వెలుగులో భాగంగా లబ్ధిదారులకు అందజేయనున్న కంటి అద్దాలు గురువారం జిల్లాకు వచ్చాయని డీఎంహెచ్ఓ డాక్టర్ శిరీష ఒక ప్రకటనలో తెలిపారు. తొలి విడుతలో 42,600 కళ్లజోళ్లు వచ్చాయని, వీటిని అవసరాన్ని బట్టి వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

ముగిసిన రాపత్తు సేవలు

నేటి నుంచి విలాసోత్సవాలు

భద్రాచలం: శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో భాగంగా జరుగుతున్న రాపత్తు సేవలు గురువారం ముగిశాయి. చివరి రోజు గ్రామ పంచాయతీ కార్యాలయంలోని నరసింహస్వామి మండపంలో వేడుకను ఘనంగా నిర్వహించారు. పల్లకీలో స్వామివారిని వేంచేపు చేసి మేళతాళాలు, భజనలు, కోలాటాల నడుమ ఊరేగింపుగా పంచాయతీ కార్యాలయానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కాగా శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు విలాసోత్సవాలు జరగనున్నాయి.


స్వామివారికి హారతి సమర్పిస్తున్న అర్చకులు

హైలెట్స్..

- రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి నిర్దేశిత సమయం కంటే గంటన్నర ఆలస్యంగా వచ్చారు.
- హెలిప్యాడ్ వద్ద మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్, ఎస్పీ తదితరులు సీఎంకు సాదరంగా స్వాగతం పలికారు.
- హెలిప్యాడ్ నుంచి మినీ బస్సు ద్వారా కలెక్టరేట్ భవన సముదాయానికి చేరుకున్నారు. అక్కడ మాజీ మంత్రి తుమ్మలతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు సీఎంకు పుష్పగుచ్ఛం అందించారు. జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య పుష్పగుచ్ఛం అందించి సీఎం పాదాలకు నమస్కరించారు.
- సభా వేదికపై నేతల పరిచయ కార్యక్రమంలో నామ నాగేశ్వరరావును టీఆర్ఎస్ పార్లమెంటరీ నాయకులు అని సంబోధించి, తర్వాత బీఆర్ఎస్ నాయకులు అని సీఎం సరి చేసుకున్నారు.
- కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా ఈ వయసులో కూడా యువకుడిలా పనిచేస్తున్నారని సీఎం ప్రశంసించారు. మొదట నాగేశ్వరరావు అని సంబోధించి, ఆ తర్వాత వనమా వెంకటేశ్వరరావు అని పేర్కొన్నారు.
- అనంతరం మినీ బస్సు ద్వారా సీఎం బీఆర్ఎస్ నూతన కార్యాలయానికి చేరుకుని శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. పార్టీ జెండాను ఎగురవేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావును కుర్చీలో కూర్చోబెట్టి అభినందనలు తెలిపారు. సీఎం పర్యటన ఆద్యంతం సందడిగా సాగింది.

ఆంక్షలు.. అవస్థలు..

సీఎం పర్యటనలో అడుగడుగునా గట్టి బందోబస్తు
- రహదారులన్నీ పోలీసుల ఆధీనంలోనే..
- కొత్తగూడెంలో వ్యాపార సముదాయాలన్నీ బంద్
- ట్రాఫిక్ ఆంక్షలతో ఇబ్బందులు పడ్డ ప్రజలు


కొత్తగూడెంలో ప్రధాన రహదారికి అనుసంధానంగా ఉన్న అంతర్గత రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు..

కొత్తగూడెం అర్బన్/ కొత్తగూడెంటౌన్/కొత్తగూడెం (సూపర్‌బజార్)/పాల్వంచ/పాల్వంచరూరల్/చుంచుపల్లి: : ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటన నేపథ్యంలో పోలీసులు కఠిన ఆంక్షలు విధించారు. దీంతో జిల్లా కేంద్రంలోని ప్రజలు అవస్థ పడ్డారు. నవభారత్‌లోని నూతన కలెక్టరేట్, కొత్తగూడెంలోని బీఆర్ఎస్ జిల్లా నూతన కార్యాలయం ప్రారంభోత్సవ నేపథ్యంలో గురువారం పోలీసులు కొత్తగూడెంలో వ్యాపార సముదాయాలన్నీ కూడా బంద్ చేయించారు. సీఎం వచ్చే ప్రధాన రోడ్డుకు అనుసంధానంగా ఉన్న రోడ్లలో కూడా రాకపోకలు లేకుండా కర్రలు కట్టి, బారికేడ్లు పెట్టి మూసివేయించారు. ఎక్కడా వాహనాలు, బస్సులు, ప్యాసింజర్ ఆటోలు నిలిపేవీలులేక ప్రయాణికులు చాలా మంది రోడ్లపై ఉన్న బస్టాండ్ల వద్ద పడిగాపులు కాశారు. ప్యాసింజర్ ఆటోలు కూడా నిలిపే అవకాశం లేకపోవడంతో పలువురు కాలినడకనే వెళ్లాల్సి వచ్చింది.

■ వన్ వేలో వాహనాలు..

ఇల్లెందు క్రాస్ రోడ్డు మొదలుకొని పాతబస్ డిపో, గణేష్‌టెంపుల్ ఏరియా, సూపర్‌బజార్, బస్టాండ్ సెంటర్ పోస్టాఫీసు సెంటర్ వరకు కూడా ఉదయం నుంచే వన్ వేలో వాహనాలను నడిపించారు. దాదాపుగా రోడ్లన్నీ పోలీసుల ఆధీనంలోనే ఉన్నాయి. పాల్వంచ-కొత్తగూడెం రహదారి గుండా వెళ్లాల్సిన వాహనాలను చాతకొండ, ఎర్రగుంట మీదుగా నవభారత్ వరకు వచ్చేలా దారిమళ్లించారు. పార్టీ జిల్లా కార్యాలయం ప్రారంభానికి సీఎం వచ్చే క్రమంలో పోస్టాఫీసు వద్ద ఖమ్మం, విజయవాడ రోడ్లలో వాహనాలు నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. సీఎం కేసీఆర్ ప్రకాశం స్టేడియంలో హెలికాప్టర్ ఎక్కిన వెళ్లిన తర్వాత, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు వాహనాలన్నీ వెళ్లేవరకూ ట్రాఫిక్ పాట్లు తప్పలేదు. కలెక్టరేట్ వద్ద సభ ముగిశాక కూడా బయటకు పంపించకపోవడంతో సభికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బారికేడ్లను నెట్టివేసి, పోలీసులను తోసేసి వెళ్లిపోయారు. కలెక్టరేట్ ప్రవేశద్వారం వద్ద తనిఖీలు చేయడంతో ప్రజలు బారులుతీరాల్సి వచ్చింది.


కలెక్టరేట్ నుంచి బయటకు వెళ్లనివ్వక పోవడంతో పోలీసులపై సభికుల ఆగ్రహం..

■ 4 కిలోమీటర్ల వరకు వాహనాల నిలిపివేత..


త్రీఇంక్లైన్ టూటౌన్ పోలీసు స్టేషన్ వద్ద వాహనదారులను నిలిపివేస్తున్న పోలీసులు

కొత్తగూడెం రైటర్‌బస్తీలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుంచి త్రీఇంక్లైన్‌లోని టూటౌన్ పోలీసు స్టేషన్‌కు దాదాపు 4 కిలో మీటర్లు ఉంటుంది. సీఎం వచ్చి వెళ్లేవరకూ సుమారు 30 నిమిషాల (4.10 గంటల నుంచి 4.40 గంటలు) వరకు పోలీసులు ఆర్టీసీ బస్సులు, లారీలు, స్కూల్ బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనదారులను అడ్డుకున్నారు. సీఎం పర్యటన ముగిసి హైదరాబాద్‌కు పయనమైన తరువాత 4.50 నిమిషాలకు రాకపోకలను అనుమతించారు.


కలెక్టరేట్ వద్ద తనిఖీ చేస్తుండటంతో బారులుదీరిన ప్రజలు


బారికేడ్లను తోసుకుని వెళ్తున్న ప్రజలు


బస్టాప్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

■ పడిగాపులు...


సీఎం రాక కోసం పడిగాపులు కాస్తున్న జనం

సీఎం కలెక్టరేట్ ప్రారంభోత్సవానికి మధ్యాహ్నం 2 గంటలకల్లా వస్తారని ఆశించారు. మహబూబాబాద్ కలెక్టరేట్ ప్రారంభం ముగించుకుని ఇక్కడికి మధ్యాహ్నం 3.22 గంటలకు సీఎం చేరుకున్నారు. దీంతో ప్రజలు మధ్యాహ్నం 12 గంటల నుంచి పడిగాపులు కాయాల్సి వచ్చింది. హెలికాప్టర్‌లో సీఎం కేసీఆర్ రాగానే ఒక్కసారిగా జనం కేరింతలు కొట్టారు. సీఎం కాన్వాయ్‌కు నంబర్ కోడింగ్ పాటించారు. పాల్వంచ నుంచి కొత్తగూడెం వరకు సీఎం కాన్వాయ్‌లో వెళ్లే వాహనాలకు 6666 నంబర్ కేటాయించారు. స్థానిక ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, పార్టీ నాయకుల ఆధ్వర్యంలో భారీగా జన సమీకరణ చేశారు. పలు ప్రాంతాల నుంచి ఆర్టీసీ, ఇతర వాహనాల ద్వారా ప్రజలను సభకు తరలించారు.

■ ముందస్తు అరెస్టు

జిల్లా కేంద్రం కొత్తగూడెం వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ పరిధిలో పలువురు రాజకీయ నాయకులను ముందస్తుగా బుధవారం రాత్రే అరెస్టు చేశారు. కొత్తగూడెం పాలకేంద్రం నుంచి సూపర్‌బజార్, పోస్టాఫీస్, రైటర్‌బస్తీ ఎల్ఐసీ ఆఫీస్ మీదుగా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వరకు పోలీసులు వన్‌వే చేశారు. పోలీసులు గంటల తరబడి ఎక్కడి వాహనాలను అక్కడే నిలిపివేశారు.

■ బ్యానర్లలో మాజీ సీఎస్ ఫొటోలు..

నవభారత్‌లో ఏర్పాటు చేసిన స్వాగత ఫ్లెక్సీలు, బ్యానర్లలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ ఫొటోలు కనిపించడం చర్చనీయాంశంగా మారింది. నూతన సీఎస్ బాధ్యతలు చేపట్టినా... మాజీ సీఎస్ ఫొటోలు కనిపించడంతో పలువురు అయోమయానికి గురయ్యారు.

▌స్వల్పంగా తొక్కిసలాట..

సీఎం పర్యటన నేపథ్యంలో అడుగడుగునా భారీ బందోబస్తు నిర్వహించారు. ఎస్పీ డాక్టర్ వినీత్ ఆధ్వర్యంలో కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల్లో సుమారు 2వేల మంది పోలీస్ బలగాలతో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నారు. కలెక్టరేట్‌లోకి వచ్చే వారిని సైతం తనిఖీలు చేశారు. సభకు వచ్చిన ప్రజలకు కలెక్టరేట్ పక్కనే ఉన్న క్వార్టర్ల సముదాయం నుంచి ప్రజలకు భోజనాలను అందించారు. గేట్లు వేసి పై నుంచి అందించడంతో స్వల్పంగా తొక్కిసలాట జరిగింది.


భోజనం ప్యాకెట్ల కోసం తొక్కిసలాట..


కలెక్టరేట్ ముందు స్థలంలో పార్కింగ్..

■ ప్రత్యేకంగా వాహనాల పార్కింగ్

కలెక్టరేట్ ముందు భాగంలో వాహనాల కోసం ప్రత్యేకంగా పార్కింగ్ ఏర్పాటు చేశారు. మున్సిపల్, పోలీస్ అధికారులు విశాలమైన స్థలం కేటాయించడంతో ఎలాంటి ఇబ్బంది కలగలేదు. కాగా జర్నలిస్టులకు ఫొటోలు లేకుండా పాస్‌లు జారీ చేయడంతో సభా ప్రాంగణం వద్ద ఎవరూ మీడియానో, ఎవరు కాదో అర్థంకాలేదు.

▌కళాకారులకు నిరాశే..

సీఎంకు బీఆర్ఎస్ కార్యాలయం వద్ద స్వాగతం పలికేందుకు గిరిజన సంప్రదాయ కళాకారులను ఆహ్వానించారు. అశ్వారావు పేట నుంచి కొమ్ము నృత్యబృందం, దుమ్ముగూడెం నుంచి కంచుమేళం కళాకారులుతోపాటు లంబాడీ నృత్య కళాకారులను పిలిపించారు. కానీ కళలు ప్రదర్శించకుండానే పార్టీ కార్యాలయ సమీపంలోని స్కూల్, చర్చిల ఆవరణలోనే ఉంచారు. సీఎం పర్యటన ముగించుకుని హెలికాప్టర్‌లో తిరిగి వెళ్లేవరకు వారినీ బయటకు రానీయలేదు. దీంతో ఈ మాత్రం దానికి తమను ఎందుకు పిలిపించినట్లని కళాకారులు ఆవేదన వ్యక్తం చేశారు.


నిరాశలో కొమ్ము నృత్య కళాకారులు


బీఆర్ఎస్ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న విప్ కాంతారావు

● సభా ప్రాంగణంలో సందడి..

నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవ వేడుకలో సందడి నెలకొంది. పోలీసుల, ఇతర శాఖల అధికారులు అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించారు. తొలుత సీఎం కేసీఆర్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం


పోలీసుల గౌరవవందనం స్వీకరిస్తున్న సీఎం కేసీఆర్


బస్సులో నుంచి అభివాదం చేస్తున్న సీఎం..


నూతన కలెక్టరేట్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్


సభా వేదిక వద్ద నిలిపిన వాహనాన్ని తరలిస్తున్న పోలీసులు


జర్నలిస్టులను కట్టడి చేయాలని డీపీఆర్వోకు సూచిస్తున్న ఏఎస్పీ


బందోబస్తును పర్యవేక్షిస్తున్న ఎస్పీ వినీత్


లంబాడీ గిరిజనులను అడ్డుకుంటున్న పోలీసులు

■ కలెక్టరేట్ వద్దా అదే పరిస్థితి..

సీఎంకు స్వాగతం పలకాలని పలువురు గిరిజన మహిళలు సంప్రదాయ వేషధారణలో బిందెలు చేబూని నూతన కలెక్టరేట్ వద్దకు వచ్చారు. కానీ పోలీసులు వారిని అనుమతించలేదు. సభా ప్రాంగణంలోకి వెళ్లకుండా అడ్డుకోవడంతో కలెక్టరేట్ పక్కన నిరీక్షించారు.

ఆలయాల్లో ఎండోమెంట్ ఏసీ పూజలు


భద్రాచలంలో అధికారులకు వేదాశీర్వచనం అందచేస్తున్న అర్చకులు

భద్రాచలం/పాల్వంచ రూరల్/ఖమ్మం గాంధీ చౌక్/కొత్తగూడెం టౌన్: ఉమ్మడి జిల్లాలోని పలు ఆలయాల్లో దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ కూరాకుల జ్యోతి, ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ ఏ.సులోచన, ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ డిప్యూటీ కలెక్టర్ రమాదేవి గురువారం పూజలు చేశారు. భద్రాచలం ఆలయంలో లడ్డూల అంశంపై విచారణ వచ్చిన వారు తొలుత ఖమ్మంలోని శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం, పాల్వంచ మండల పరిధి పెద్దమ్మతల్లి ఆలయం, కొత్తగూడెంలోని శ్రీవిజయ విఘ్నేశ్వరస్వామి దేవస్థానం(గణేష్‌టెంపుల్)ను కూడా సందర్శించారు. ఆతర్వాత భద్రాచలంలో రామాలయాన్ని సందర్శించి అంతరాలయంలో మూలమూర్తులు, ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈమేరకు ఆలయాల్లో ఈఓలు, అర్చకులు వారికి స్వాగతం పలికి దర్శనం చేయించాక జ్ఞాపికలు, ప్రసాదాలు అందజేశారు. ఆయా ఆలయాల ఈఓలు శివాజీ, ఎస్.రజనీకుమారి, ఏ.జగన్మోహన్ రావు, కె.సులోచనతో పాటు అర్చక, ఉద్యోగులు గౌరీశంకర్, సమత, ఆనంద్, పి.బేల్‌సింగ్, మునగలేటి భార్గవాచార్యులు, అన్నవజ్జల ప్రసాద్‌శర్మ, రాధాకృష్ణశాస్త్రి, జానకీరామశర్మ, శ్రీనివాసాచారి, కృష్ణప్రసాదశర్మ, అవధానుల సీతారామశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

యూసుఫ్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం


బ్యాటింగ్ చేసి టోర్నీని ప్రారంభిస్తున్న హరిప్రసాద్

బూర్గంపాడు: బూర్గంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 15వ యూసుఫ్ మెమోరియల్ జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ టోర్నీ ఐటీసీ పీఎస్‌పీడీ రికగ్నైజ్డ్ యూనియన్ అధ్యక్షుడు కనకమేడల హరిప్రసాద్ బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 ఏళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన క్రికెటర్ యూసుఫ్ స్మారకంగా అతని మిత్రులు నిర్విఘ్నంగా క్రికెట్ టోర్నీ నిర్వహించటం అభినందనీయమన్నారు. మాజీ ఎంపీటీసీ సభ్యులు జక్కం సర్వేశ్వరరావు, ఉపసర్పంచ్ సెనగ సాయిప్రత్యూష, సొసైటీ డైరెక్టర్ బొల్లు రవి, గుర్తింపు కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి గాదె రామకోటిరెడ్డి, హెచ్ఎం జాన్సన్, నవీన్ బాబు, నాగిరెడ్డి, టోర్నీ నిర్వాహకులు సోహైల్ పాషా, గోనెల సర్వేశ్వరరావు, భజన సతీష్, గోనెల నాని, అబ్దుల్ సలీమ్, సారథి, సత్తిపండు, మందా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

16 వరకు విజయవాడ ప్యాసింజర్ రైలు రద్దు

కొత్తగూడెంఅర్బన్: విజయవాడ నుంచి భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ వరకు నడిచే రైలును శుక్రవారం నుంచి ఈనెల 16 వరకు రద్దు చేస్తున్నట్లు భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పండుగ నేపథ్యంలో విజయవాడ రూట్‌లో ఇతర రైళ్ల రద్దీ ఉండడం, ఈ రైలుకు తగినంత డిమాండ్ లేకపోవడంతో తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

'నెల్లిపాక' సమావేశానికి డైరెక్టర్ల గైర్హాజరు..

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలకవర్గ సమావేశానికి డైరెక్టర్లు గైర్హాజరయ్యారు. 2021–22 ఏడాది స్పెషల్ ఆడిట్‌లో రూ.20,06,252 దుర్వినియోగం అయ్యాయని అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. పాలకవర్గ సమావేశం నిర్వహించి నిధుల దుర్వినియోగానికి సంబంధించి బాధ్యుడిగా సంఘం సీఈఓ రామారావును సస్పెండ్ చేయాలని జిల్లా సహకార అధికారి వెంకటేశ్వర్లు గత నెల 31న ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం మొండికుంటలోని సంఘం కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సొసైటీలో చైర్మన్ సహా 11 మంది డైరెక్టర్లు ఉన్నారు. కాగా చైర్మన్‌తోపాటు ముగ్గురు డైరెక్టర్లు కలిపి నలుగురే పాలకవర్గ సమావేశానికి హాజరయ్యారు. మిగిలిన ఏడుగురు గైర్హాజరయ్యారు. కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేశారు. మళ్లీ ఈ నెల 17న సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఇటీవల తోగ్గూడెంలో నిర్వహించిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆత్మీయ సమ్మేళనానికి నెల్లిపాక సహకార సంఘం అధ్యక్షుడు తుక్కాని మధుసూదన్‌రెడ్డి హాజరు కావడం, అనంతరం నిధుల దుర్వినియోగానికి సంబంధించి నిర్వహించిన పాలకవర్గ సమావేశానికి బీఆర్ఎస్ పార్టీకి చెందిన డైరెక్టర్లు హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. పార్టీ ఆదేశాల మేరకు డైరెక్టర్లు గైర్హాజరు అయ్యారా? ముఖ్యమంత్రి కార్యక్రమం ఉన్నందున సమావేశానికి రాలేకపోయారా అనేది తెలియాల్సి ఉంది.

అణగారిన వర్గాలకు అధికారమే లక్ష్యం

డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్


అభివాదం చేస్తున్న డాక్టర్ విశారదన్ మహారాజ్

బూర్గంపాడు: అణగారిన వర్గాలకు రాజ్యాధికారమే లక్ష్యంగా పదివేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర చేపట్టినట్లు డీఎస్పీ (దళిత్ శక్తి ప్రోగ్రాం) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ పేర్కొన్నారు. స్వరాజ్య పాదయాత్ర గురువారం బూర్గంపాడు మండలంలోని నాగినేనిప్రోలు, బూర్గంపాడు, మోరంపల్లిబంజర, పినపాక పట్టీనగర్ గ్రామాల మీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన జెండాలను ఆవిష్కరించి మాట్లాడారు. గోదావరి తీర ప్రాంతాల్లో అట్టడుగు కులాలకు కుంట భూమిలేదని ఆరోపించారు. రాష్ట్రంలోని భూమి, సంపద, రాజ్యాధికారం కేవలం రెండుశాతం ఉన్న అగ్రవర్ణాల చేతుల్లోనే ఉందని ఆరోపించారు. స్వరాజ్య పాదయాత్రతో బీసీ, ఎస్సీ, ఎస్టీలను ఏకం చేసి వారిని చైతన్యపరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాదయాత్ర ఇన్‌చార్జ్ లక్ష్మణ్ మహారాజ్, డీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, జిల్లా అధ్యక్షుడు మధుసూదన్, వెంకట్, ముత్యాలరావు, అంజి, అనిల్, ప్రవీణ్, దుర్గాప్రసాద్, కిరణ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనతో ఒరిగిందేమీ లేదు

టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎడవల్లి కృష్ణ


మాట్లాడుతున్న ఎడవల్లి కృష్ణ

ములకలపల్లి : సీఎం కేసీఆర్ భద్రాద్రి కొత్తగూడెం పర్యటనతో జిల్లా ప్రజలకు ఒరిగిందేమీలేదని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎడవల్లి కృష్ణ విమర్శించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన యూనివర్సిటీ ఊసే ఎత్తలేదని అన్నారు. పోడు పట్టాలు ఇవ్వలేదని, పోడు భూముల విషయంలో స్పష్టత లేకపోవడం వల్లే అటవీశాఖ, సాగుదారుల మధ్య వివాదాలు చెలరేగుతున్నాయని ఆరోపించారు. ఆరునెలలుగా గ్రామపంచాయతీలకు నిధులు నిలిచిపోగా, జీపీకి రూ.10 లక్షలు మంజూరు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. పాల్వంచ పట్టణ పరిధిలోని 444, 817 సర్వేనంబర్లలో అర్ధంతరంగా నిలిపివేసిన రిజిస్ట్రేషన్ల వ్యవహారంపై సీఎం స్పష్టత ఇస్తారని ఆశించిన స్థానికులకు ఆశాభంగమే కలిగిందని పేర్కొన్నారు. స్థానిక సమస్యలు సీఎంకు విన్నవిద్దామనుకుంటే కాంగ్రెస్ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసి, ప్రధాన ప్రతిపక్షం నోరు నొక్కారని ఆరోపించారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పాల్వంచ, కొత్తగూడెం పట్టణాల అధ్యక్షులు నూకల రంగారావు, బొమ్మిడి మల్లికార్జున్, ములకలపల్లి మండల అధ్యక్షుడు పేటేటి నర్సింహారావు, సీనియర్ నాయకులు రాయల శాంతయ్య, చావా వీరయ్యచౌదరి, పల్లపు వెంకటేశ్వర్లు, సిరంగి శ్రీనివాస్, ఏలూరి రాజేశ్, వాలి, జరీనా, స్థానిక నాయకులు బుగ్గారపు సత్యనారాయణ, జహీరుద్దీన్, కొప్పుల రాంబాబు, పాలకుర్తి రవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తరుగు పేరుతో కోత

దుమ్ముగూడెం: మండలంలోని మారాయిగూడెం కొనుగోలు కేంద్రంలో ధాన్యం అమ్మగా 61 బస్తాల ధాన్యం తరుగుగా తీసిన సంఘటనపై విచారణ చేసి, నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా నాయకులు వంశీ, బొల్లి సత్యనారాయణలు డిమాండ్ గురువారం చేశారు. కొనుగోలు కేంద్రం ధాన్యం వెంకట సాయి రైస్ మిల్‌కు వచ్చిన తరువాత ప్రతి ఒక్కరి ధాన్యంలో ఏదో రకంగా తరుగు చూపుతూ కోత పెట్టారని, ఈ మేరకు కొందరు రైతులతో సంతకాలు చేయించుకున్నారని వెల్లడించారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ తొడెం తిరుపతిరావు, అర్జున్, అపకా సంతోష్, కారం శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమై సర్వం కోల్పోయిన గుంజాల కృష్ణ కుటుంబానికి భారజల కర్మాగారం గౌతమీస్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. చింతిర్యాల క్రాస్ రోడ్డు గ్రామంలో బ్రెయిన్ సమస్యతో బాధపడుతున్న రాదారపు విజయ్ వైద్యానికి గౌతమీస్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.15 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కె.సోమయ్య, నారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు..

అశ్వాపురం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్య చదువుతూ సేవా భారతి సంస్థ, గౌతమీస్ఫూర్తి ఫౌండేషన్ వారి సహకారంతో ఐఐటీ జేఈఈ శిక్షణ పొందుతున్న 15 మంది విద్యార్థులకు లయన్స్‌క్లబ్ మణుగూరు సీనియర్ సభ్యులు, భద్రాద్రి జోన్ చైర్మన్ డాక్టర్ దుస్సా సమ్మయ్య గురువారం రూ.9వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఐఐటీ జేఈఈ పరీక్ష రాసేందుకు ప్రిన్సిపల్ సత్యప్రకాష్‌కు ఆ నగదును అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత, నేను సైతం సోషల్ రెస్పాన్సిబిలిటీ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు, కళాశాల అధ్యాపకుడు తారా ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

మణుగూరురూరల్: మండల పరిధిలోని రామానుజవరం గ్రామపంచాయతీ పరిధి ఓసీ4 నిర్వాసిత పెద్దిపల్లి గ్రామంలో 50 వలస గొత్తికోయల కుటుంబాలకు ఓ మహిళా సామాజిక కార్యకర్త జన్మదిన సందర్భంగా గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాల పట్ల ఓసీ2 పవర్ సెక్షన్ ఉద్యోగి చిట్టూరి రవిబాబు హర్షం వ్యక్తం చేశారు. జన్మదిన కేక్ కట్‌చేసి మిఠాయిలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగరేణి సేవా సమితి సభ్యులు ఎస్‌డీ.నాసర్ పాషా, గ్రామపెద్దలు బాబురావు, కోశయ్య, అంగన్‌వాడీ కార్యకర్త శ్రీలత పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడికి పరామర్శ

మణుగూరురూరల్: మండల పరిధిలోని రామానుజవరం గ్రామంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్యాచారి సతీమణి అనసూర్య గత శుక్రవారం అనారోగ్యంతో మరణించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.షాబీర్‌పాషా గురువారం వారి గృహానికి వెళ్లి అయోధ్యను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలు వేసి ఘన నివాళ్లర్పించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కమటం వెంకటేశ్వరరావు, నరాటి ప్రసాద్, సరెడ్డి పుల్లారెడ్డి, మండల కార్యదర్శి జంగం మోహన్‌రావు, నాయకులు సురేష్, నరసింహారావు, వీరస్వామి, మనోహరచారి, నాగేశ్వరరావు, కుటుంబరావు, మల్లికార్జున్, శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రమేష్, ఎంపీటీసీ లక్ష్మయ్య, రామారావు, గురవయ్య, సీతయ్య పాల్గొన్నారు.

కాజిపేట కృష్ణకు సన్మానం

మణుగూరుటౌన్: సింగరేణి మాదిగ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కొత్తగూడెం రీజియన్ ఇన్‌చార్జ్ కాజిపేట కృష్ణను గురువారం రాత్రి మణుగూరు మాదిగ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అదే విధంగా సింగరేణి మాదిగ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ మణుగూరు ఏరియా వైస్ ప్రెసిడెంట్ కుమారస్వామి, కార్యదర్శి రాజేష్, చీఫ్ ఆర్గనైజర్ గంగాధర్‌లను నియమించినారు. మాదిగ ఐక్య వేదిక ఆధ్వర్యంలో వారిని స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాదిగ ఐక్యవేదిక పినపాక నియోజకవర్గ అధ్యక్షుడు రావులపల్లి రాంమూర్తి, రమేష్, మాదిగ ఐక్య వేదిక ప్రధాన కార్యదర్శి గద్దల నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు బోయిల్ల వెంకటేశ్వరరావు, నల్లగట్ల రఘు, బోయిల్ల రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తో అభివృద్ధి

అశ్వారావుపేటరూరల్: కాంగ్రెస్ పార్టీ హయంలోనే సమగ్ర అభివృద్ధి జరిగిందని, ప్రజలకు సంక్షేమ పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ మండల నాయకులు మొగళ్లపు చెన్నకేశవరావు అన్నారు. మండలంలోని గుమ్మడవల్లి, మామిళ్లవారిగూడెం గ్రామాల్లో గురువారం గడపగడపకూ ప్రచారం కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు ధంజు నాయక్, పేటేటి నరసింహారావు, బూషి పాండు, మహేష్, ప్రతాప్, రాంబాబు పాల్గొన్నారు.

ఆదర్శం.. ఈ సర్కారు బడి!

- కార్పొరేటుకు దీటుగా విద్య
- మౌలిక సదుపాయాల కల్పనలో భేష్
- పలు రంగాల్లో రాణిస్తున్న విద్యార్థులు



ప్రొజెక్టర్ ద్వారా డిజిటల్ తరగతులు బోధిస్తున్న ఉపాధ్యాయుడు



సూదిరెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ పాఠశాల..

దుమ్ముగూడెం: లక్షలు ఖర్చుపెట్టి కార్పొరేట్ విద్యను అందుకోలేని ఏజెన్సీ ప్రాంత విద్యార్థులకు మండలంలోని నర్సాపురం గ్రామంలోని సూదిరెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ పాఠశాల ఓ మార్గంగా కనిపిస్తోంది. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఇక్కడ అందిస్తున్న విద్య, కల్పిస్తున్న సదుపాయాలు విద్యార్థులను ఆకర్షిస్తున్నాయి. ఎన్ఆర్ఐలు సూదిరెడ్డి బ్రదర్స్ ప్రభుత్వ సహకారంతో సొంత నిధులతో ఈ పాఠశాలను నిర్వహిస్తుండగా.. 2004 సంవత్సరంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా దీనిని ప్రారంభించారు. నాటి నుంచి సూదిరెడ్డి సోదరులు పాఠశాలకు అవసరమైన సామగ్రి, విద్యార్థులకు అవసరమైన నోట్ బుక్స్, షూలు అందిస్తూ సహకరిస్తున్నారు.

సకల సౌకర్యాల కల్పన

విద్యార్థులు ఆటలు ఆడుకునేందుకు పాఠశాల వెనకాల ఉన్న రెండున్నర ఎకరాల స్థలాన్ని క్రీడామైదానంగా ఏర్పాటు చేశారు. పాఠశాల ఎదుట చదువులతల్లి సరస్వతి విగ్రహాన్ని నెలకొల్పారు. పాఠశాలకు వచ్చే విద్యార్థుల కోసమే ప్రత్యేకంగా రూ.60వేలతో బస్ షెల్టర్‌ను నిర్మించారు. సైన్స్‌ల్యాబ్, లైబ్రరీ, కంప్యూటర్, ప్రింటర్‌లను ఏర్పాటు చేశారు.

విద్యార్థుల ప్రతిభ..

నర్సాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో 10వ తరగతి విద్యను అభ్యసించిన చాలా మంది విద్యార్థులు మంచి ప్రతిభను కనబరిచారు. 2004లో ప్రారంభమైన ఈ పాఠశాలలో 2022 విద్య సంవత్సరం వరకు 10వ తరగతి విద్యార్థుల ప్రతిభ కనిపిస్తూనే ఉంది. పాఠశాలలో ప్రొజెక్టర్‌పై డిజిటల్ తరగతులు నిర్వహిస్తూ ప్రతి వారం పరీక్షలను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో వారిలోని ప్రతిభకు పదునుపెట్టినట్లు అయింది. 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ వారిని సార్వత్రిక పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. ప్రథమ, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులకు దాతలు నగదు రూపంలో ఆర్థిక సాయం అందజేస్తూ వారిలో ప్రేరణ నింపుతున్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఇతర రంగాల్లోనూ మెరుగ్గా రాణిస్తున్నారు.

ఉపాధ్యాయుల కృషి..

నర్సాపురం జిల్లా పరిషత్ పాఠశాలలోని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు కేవీ కాంతారావు ఆధ్వర్యంలో అంకితభావంతో విధులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులతో ప్రయోగాలు, సైన్స్ ఫేర్, వ్యాసరచనలు, ప్రాజెక్టు వర్క్‌లు, సాంస్కృతిక కార్యక్రమాలు వంటి అంశాలపై ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు. చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహిస్తున్నారు.

మెరుగైన విద్య అందిస్తున్నాం..



ప్రభుత్వం అందజేసే సౌకర్యాలను విద్యార్థులకు అందజేసి వారికి నాణ్యమైన విద్యను నిరంతరం అందచేసేందుకు కృషి చేస్తున్నాం. పదిలో మెరుగైన ఫలితాలు పునరావృతం చేసేందుకు ప్రత్యేక తరగతులను తీసుకుంటున్నాం. విద్యార్థుల ప్రతిభపై తల్లిదండ్రులకు సమాచారం అందజేస్తూ వారిని మరింత పదును పెట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటాన్నాం.

– కె.విజయకాంతారావు, ప్రధానోపాధ్యాయుడు

డ్రెయినేజీ పనులు షురూ..



డ్రెయినేజీలో పూడిక తీత పనులు చేపడుతున్న కార్మికులు

సాక్షి ఎఫెక్ట్..

అశ్వాపురం: మండల కేంద్రంలోని చవిటిగూడెం గ్రామంలో డ్రెయినేజీ సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతుండటంతో గురువారం సర్పంచ్ బాణోత్ శారద, ఉపసర్పంచ్ చందూలాల్, పంచాయతీ కార్యదర్శి కృష్ణచైతన్య ఆధ్వర్యంలో డ్రెయినేజీ పూడిక తీత, దోమల మందు పిచికారీ పనులు చేపట్టారు. ఈ నెల 12న 'అధ్వానంగా డ్రెయినేజీ'అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో స్పందించిన సర్పంచ్, ఉపసర్పంచ్, కార్యదర్శి డ్రెయినేజీ పూడిక తీత పనులు చేయించారు. దోమలు విజృంభించకుండా దోమల మందు పిచికారీ చేయించారు.

ప్యానెల్ టీం సందర్శన

దమ్మపేట: మండల పరిధిలోని అంకంపాలెం బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను ప్యానెల్ టీం సభ్యులు గురువారం సందర్శించారు. తొలుతగా స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆపై పాఠశాలలో ఉపాధ్యాయుల బోధన శక్తి సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాల నిర్వహణకు సంబంధించిన వివిధ రికార్డులను సమగ్రంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే మెనూను పరిశీలించి, వండిన ఆహార పదార్థాలను పరిశీలించారు. సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్యానెల్ టీం అధికారి భద్రు, హెచ్‌ఎం.వెంకటేశ్వర్లు, వార్డెన్ భవానీ, తదితరులు పాల్గొన్నారు.



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న టీం సభ్యులు

పలువురు నాయకుల ముందస్తు అరెస్ట్

భద్రాచలంఅర్బన్, దుమ్ముగూడెం, మణుగూరురూరల్, అశ్వాపురం, గుండాల: సీఎం కేసీఆర్ కొత్తగూడెం పర్యటన సందర్భంగా ఆదివాసీ సంఘాల నాయకులతో పాటు పలు రాజకీయ పార్టీల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఆదివాసీ కొండరెడ్ల సంఘం, గోండ్వానా సంక్షేమ పరిషత్ నాయకులతోపాటు కాంగ్రెస్ పార్టీ, బీజేపీ, వైఎస్సార్ తెలంగాణ, ప్రజాపంథా నాయకులు అరెస్టైన వారిలో ఉన్నారు. మరోవైపు భద్రాచలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులను పోలీసులు నిర్బంధించారు. ఆయా ప్రాంత సమస్యలపై ప్రతిపక్షాలు నిలదీస్తాయనే భయంతోనే ముందస్తుగా అక్రమ అరెస్టులు చేయిస్తున్నారని ఈ సందర్భంగా విమర్శించారు.

ఘనంగా వివేకానంద జయంతి

స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని నిర్వహించే నేషనల్ యూత్ ఫెస్టివల్‌ను గురువారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. పలు పాఠశాలలు, కళాశాలల్లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు కొనసాగగా.. రాజకీయ పార్టీలు, వాటి అనుబంధ సంఘాల ఆధ్వర్యంలోనూ చేపట్టారు. అందులో భాగంగా స్వామి వివేకానంద విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులకు ఎస్సె రైటింగ్, పాటలు, డిబేట్ కాంపిటీషన్లు ఏర్పాటు చేసి, గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



భద్రాచలంటౌన్: వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీఐ నాగరాజు రెడ్డి



మణుగూరురూరల్: మాట్లాడుతున్న యూటీఎఫ్ మండల అధ్యక్షుడు మీరాహుస్సేన్



దుమ్ముగూడెం: ప్రభుత్వ కళాశాలలో జయంతి కార్యక్రమం..



అశ్వారావుపేట: వివేకానంద విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సుబ్రహ్మణ్యం



భద్రాచలం: వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బాలిక అదృశ్యం

అశ్వారావుపేటరూరల్: ఓ మైనర్ బాలిక కనిపించకుండా పోవడంతో గురువారం పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్సై సాయి కిశోర్ రెడ్డి కథనం ప్రకారం .. మండలంలోని మల్లాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలిక ఈ నెల 10వ తేదీ ఉదయం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దాంతో కుటుంబీకులు తమ బంధువులు, స్నేహితుల వద్ద గాలించినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. కాగా తమ కుమార్తె కనిపించకుండా పోవడానికి పండువారిగూడెం కాలనీ గ్రామానికి చెందిన ఓ యువకుడు కారణమని, బాలిక తండ్రి అనుమానంతో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ అంతరాయం

దమ్మపేట: సబ్‌స్టేషన్‌లో విస్తరణ పనులు జరుగుతున్న కారణంగా మండల పరిధిలో విద్యుత్ సరాఫరాలో నేడు (శుక్రవారం) అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ సాయికిరణ్ తెలిపారు. నేడు గంగారం సబ్‌స్టేషన్‌లో విస్తరణ పనుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు. మండల పరిధిలోని దమ్మపేట, గట్టుగూడెం, నాయుడుపేట, లింగాలపల్లి, గండుగులపల్లి, నాచారం, నాగుపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరాఫరాలో అంతరాయం కలుగుతుందని తెలియజేస్తూ, వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ

చండ్రుగొండ: మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్లను ఎస్సై గొల్లపల్లి విజయలక్ష్మి గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఎస్సై కోటేశ్వరరావు, సంఘం మండల అధ్యక్షుడు లంకా నర్సింహారావు, పులి సత్యం, మక్కా రమేష్, పసుపులేటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడిగా గాదెగోని

ములకలపల్లి: బీసీ సంక్షేమ సంఘం విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడిగా జగన్నాథపురానికి చెందిన గాదెగోని వెంకటేశ్ నియమితులైనట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు రెడ్డిమళ్ల వెంకటేశ్వర్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

వర్ధంతి సభ

దమ్మపేట: మండల కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో సీపీఎం ఆధ్వర్యంలో దివంగత చామర్తి పుండరీకాక్ష శాస్త్రి వర్ధంతి సభను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో జిల్లా నాయకులు దొడ్డా లక్ష్మీనారాయణ మాట్లాడారు. నాయకులు మోరంపూడి శ్రీనివాసరావు, కొప్పుల శ్రీనివాసరావు, నరసింహారావు, మరేషు తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం పంపిణీ

అశ్వాపురం: అశ్వాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మల్టీపర్పస్ వర్కర్లుగా పని చేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బందికి ఒక్కొక్కరికి రెండు జతల యూనిఫాం గురువారం సర్పంచ్ బాణోత్ శారద, పాలకవర్గ సభ్యుల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చందూలాల్, పంచాయతీ కార్యదర్శి కృష్ణచైతన్య, వార్డు సభ్యులు గాదె కేశవరెడ్డి, చంద్రకళ, ఓరుగంటి రాధిక, కోఆప్షన్ సభ్యుడు గంజి షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

సుదర్శన హోమంలో ఎమ్మెల్యే

దమ్మపేట: మండల కేంద్రంలోని సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో నిర్వహించిన సుదర్శన హోమంలో స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. హోమ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వీక్షించి, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యుడు దారా యుగంధర్, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, ఆలయ చైర్మన్ పసుమర్తి వీరేశ్వరరావు, బీఆర్ఎస్ నాయకులు యార్లగడ్డ బాబు, అబ్దుల్‌జిన్నా, చిన్నశెట్టి సత్యనారాయణ, వీరబాబు, చిట్టిబాబు, నాగయ్య పాల్గొన్నారు.



సుదర్శన హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

వాలీబాల్ పోటీలు ప్రారంభం

ములకలపల్లి: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని, వ్యక్తుల మధ్య స్నేహసంబంధాలు మెరుగుపడుతాయని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. మండలపరిధిలోని పాతగంగారం గ్రామంలో నిర్వహిస్తున్న మండలస్థాయి వాలీబాల్ పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు సోయం వీరభద్రం, బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు జారే ఆదినారాయణ వేర్వేరుగా సందర్శించి, క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అశ్వారావుపేటరూరల్: స్థానిక ప్రభుత్వ మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ టీ సంగీత కోరారు. ఈ మేరకు ఆమె గురువారం మాట్లాడుతూ.. పాఠశాలలో 2023–24 సంవత్సరానికి సంబంధించి 5, 6, 7, 8వ తరగతుల్లో ప్రవేశం కోసం అర్హత ఉన్న విద్యార్థులు ఈ నెల 15వ తేదీ నుంచి 30వ తేదీలోపు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని ఆమె సూచించారు. ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకునే విద్యార్థులు నేరుగా స్థానిక పాఠశాలకు రావాలని, ఆన్‌లైన్‌లో వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు పెట్టుకోవాలని అన్నారు. మైనార్టీ విద్యార్థులకు 30 సీట్లు, బీసీ విద్యార్థులకు 5 సీట్లు, ఎస్సీ–2, ఎస్టీ–2, ఓసీ–1 చొప్పున మొత్తం 40 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అదే విధంగా బ్యాక్‌లాగ్ సీట్లు 6వ తరగతిలో మైనార్టీలకు 10, 7వ తరగతిలో–5, ఎనిమిదోవ తరగతిలో 6 సీట్లు ఉన్నట్లు వివరించారు. దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులను వచ్చే ఏప్రియల్ నెలలో డ్రా విధానంలో ఎంపిక చేస్తామని అన్నారు. వివరాలకు 7995057877, 9515165994 లను సంప్రదించవచ్చని ప్రిన్సిపాల్ కోరారు.

తెల్లంకు ఎమ్మెల్యే పరామర్శ



వెంకట్రావ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీరయ్య

భద్రాచలంటౌన్: అస్వస్థత గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తెల్లం వెంకట్రావ్‌ను భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య పరామర్శించారు. గురువారం ఆస్పత్రికి వెళ్లిన ఆయన వెంకట్రావ్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే వీరయ్య ఆకాంక్షించారు.

సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ

మణుగూరుటౌన్: మణుగూరు మండల ఎక్స్‌లెంట్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ఈనెల 9నుంచి11వరకు నిర్మల్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫెయిర్‌లో సత్తా చాటినట్లు పాఠశాల కరస్పాండెంట్ ఎండీ.యూసఫ్ షరీఫ్ తెలిపారు. 8వ తరగతి విద్యార్థి ఎండీ.రయ్యాన్ నజీఫ్ రూపొందించిన ట్రాన్స్‌పోర్టు అండ్ ఇన్నోవేషన్ విభాగంలో ఆటో లైట్ మెకానిజం ఆటోకల్వర్టు ప్రాజెక్టుకు రాష్ట్ర స్థాయిలో తృతీయ బహుమతి సాధించినట్లు, మంత్రి ఇంద్ర కరణ్‌రెడ్డి చేతుల మీదుగా దానిని అందుకున్నట్లు తెలిపారు. సహకరించిన ఉపాధ్యాయులకు యాజమాన్యం ఖాదర్, యాకూబ్, ఖాన్‌లు అభినందనలు తెలిపారు.

సిల్వర్ జూబ్లీ వేడుకలు

బూర్గంపాడు: సారపాకలోని సెయింట్ థెరిస్సా స్కూల్ (ఇంగ్లిష్ మీడియం) 25వ వార్షికోత్సవం సందర్భంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలను ఫాదర్ జయరాజు బొల్లికొండ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఫాదర్ సతీష్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలలో 25 సంవత్సరాలుగా పాఠశాలలో మేనేజర్లు, కరస్పాండెంట్లు, ఫాదర్‌లుగా పనిచేసిన 15 మందిని సత్కరించారు. ఫాదర్ అజయ్‌కుమార్, మైకేల్, సేవియర్, గిల్బర్ట్, అంటోని, తొమాస్, విజయరావు, దేవరాజు పాల్గొన్నారు.

న్యాయ సలహా కార్యాలయం ప్రారంభం

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరంలో గురువారం ప్రముఖ న్యాయవాది కొత్త మల్లేశ్వరరావు ఉచిత న్యాయ సలహా కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ కార్యాలయంలో భూవివాదాలు, కుటుంబ తగాదాలు, ఇతర సివిల్, క్రిమినల్ కేసులేమైనా పరిష్కారం కోసం తనను సంప్రదించవచ్చని, నిత్యం కార్యాలయంలో అందుబాటులో ఉంటామని లాయర్ కొత్త మల్లేశ్వర్ రావు తెలిపారు. ప్రారంభోత్సవంలో భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రేపూరి జయరాజ్, సీనియర్ అడ్వకేట్ బండారు అరుణ్ చంద్, పేరాల వెంకటేశ్వర్లు తదితరులు హాజరయ్యారు.

ముగ్గుల పోటీలు



భద్రాచలం: విజేతలకు బహుమతులు అందజేస్తున్న టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్


సాక్షినెట్‌వర్క్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పలు పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గని ముగ్గులు వేశారు. న్యాయనిర్ణేతలు వాటిని పరిశీలించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు, పాల్గొన్న ప్రతిఒక్కరికి ఆ మేరకు బహుమతులు అందజేశారు. బహుమతులు ప్రదానోత్సవాలకు ఆయా ప్రాంతాల్లోని ప్రముఖులను అతిథులుగా ఆహ్వానించి అందజేశారు. కార్యక్రమాల్లో పలు పార్టీలు, సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ వితరణ

చండ్రుగొండ: మండలంలోని టేకులబంజర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఎస్ఆర్ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొంతమంది పూర్వ విద్యార్థులు కలిసి గురువారం టీవీ వితరణగా అందించారు. ఎంఈఓ ఎస్.సత్యనారాయణ, సర్పంచ్ కుమారి, నోడల్ అధికారి పి.సంజీవరావు, ఎస్ఎంసీ చైర్మెన్ పద్మ, హెచ్‌ఎం వశ్య, చందులాల్, భారతి, లోకేష్, పాపారావు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

అంగన్‌వాడీ భ'వనం'



మండలంలోని అచ్యుతాపురం గ్రామ పంచాయతీ పరిధిలోగల దిబ్బగూడెం గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం భవనం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. దాదాపు 40 ఏళ్ల క్రితం పెంకులతో నిర్మించిన ఈ భవనంలోనే కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. దీంతో ఇప్పటికే పైకప్పులో ఉన్న పెంకులు విరిగిపడిపోతున్నాయి. మరో పక్క వాటిపై పెద్ద పెద్ద పిచ్చి మొక్కలు పెరిగి భవనంపై వనంలా మారింది. శిథిలావస్థకు చేరి ప్రమాకరంగా ఉన్న ఈ కేంద్రానికి తమ పిల్లలను పంపించేందుకు తల్లిదండ్రులు భయందోళనకు గురవుతున్నారు. కొత్త భవనం మంజూరు చేసే వరకు కేంద్రాన్ని అద్దె భవనంలోకి మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

– అశ్వారావుపేటరూరల్

ప్రశ్నించాల్సిన అధికారి: రోజారాణి, సీడీపీఓ, అశ్వారావుపేట
ఫోన్ నంబర్: 85006 61229

■ గేమింగ్

దుష్టశక్తిని శక్తిహీనం చేయండి



త్వరలో విడుదల కాబోతున్న టాక్టికల్ రోల్ ప్లేయింగ్ గేమ్ ఫైర్ ఎంబ్లమ్ ఎంగేజ్. 'ఫైర్' సిరీస్‌లో భాగంగా వస్తున్న గేమ్ ఇది. ఎన్నో సంవత్సరాల తరువాత ఒక దుష్టశక్తి తిరిగి వస్తే? భయపడితే ప్రయోజనం లేదు, భయపెడితేనే ఫలితం దక్కుతుంది. ఈ ఆటలో ఉంగరాలే ప్రధాన ఆయుధాలు. వివిధ రకాల దాడులకు ఉపకరించే మహిమాన్విత ఉంగరాలు ఇవి. ఈ గేమ్‌కు సంబంధించిన మార్పు ఏమిటంటే ప్లేయర్స్ తమ బలగాలను డైరెక్ట్‌గా కంట్రోల్ చేయవచ్చు. 2019లో వచ్చిన 'ఫైర్ ఎంబ్లమ్: త్రీ హౌజెస్' పెద్ద సక్సెస్ అయింది. దీంతో తాజా ఆటపై అంచనాలు పెరిగాయి. విజువల్ నావెల్ స్టోరీ టెల్లింగ్‌తో ప్లేయర్స్‌ను పలకరించనున్న 'ఫైర్ ఎంబ్లమ్ ఎంగేజ్' ఆ అంచనాలను అందుకోవాలని ఆశిద్దాం.

మోడ్: సింగిల్–ప్లేయర్ వీడియో గేమ్ **జానర్స్:** టాక్టికల్ రోల్ ప్లేయింగ్ గేమ్
ప్లాట్‌ఫామ్: నిన్‌టెండో స్విచ్

■ టెక్... టాక్

ఇన్‌స్టాలో ఇలా...



ఇన్‌స్టాగ్రామ్ ఎకౌంట్ నుంచి డిలీట్ చేసిన కంటెంట్‌ను రీస్టోర్ చేసుకోవడానికి...

* ఇన్‌స్టా ఓపెన్ చేసిన తరువాత ప్రొఫైల్‌పై ట్యాప్ చేయాలి.
* టాప్‌రైట్‌లోని 'మోర్ ఆప్షన్స్' ట్యాప్ చేయాలి.
* యాక్టివిటీ కంట్రోల్స్–ట్యాప్
* రీసెంట్ డిలీటెడ్–ట్యాప్
* టాప్‌లోని టైప్ ఆఫ్ కంటెంట్ (రీస్టోర్–ప్రొఫైల్ పోస్ట్స్,రీల్స్, వీడియోస్, స్టోరీస్) సెలెక్ట్ చేసుకోవాలి
* రీస్టోర్ చేయాలనుకున్నదానిపై ట్యాప్ చేయాలి.
* టాప్ రైట్‌లోని మోర్ ఆప్షన్–ట్యాప్
* రీస్టోర్ టు ప్రొఫైల్ లేదా రీస్టోర్ టు రీస్టోర్ కంటెంట్ ట్యాప్ చేయాలి.

వాట్సాప్‌లో కెప్ట్ మెసేజ్ ఫీచర్



ఇన్‌స్టంట్ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్ 'కెప్ట్ మెసేజ్' అనే కొత్త ఫీచర్‌ని పరీక్షిస్తోంది. దీనితో డిజపీయరింగ్ మెసేజ్‌లను సేవ్ చేయవచ్చు. చాట్‌లకు సంబంధించి మరింత కంట్రోల్‌కు యూజర్‌లకు ఉపకరించే ఫీచర్ ఇది. 2021లో స్నాప్‌చాట్... మొదలైన వాటి స్ఫూర్తితో వాట్సాప్ 'డిజప్పియరింగ్ మెసేజ్' ఫీచర్‌ను ప్రవేశ పెట్టింది. ఎవరికైనా మెసేజ్ పంపినప్పుడు నిర్ణీతమైన కాలవ్యవధి తరువాత మెసేజ్ దానికదే డిలీట్ అయిపోతుంది. మళ్లీ దాన్ని చూడడం కుదరదు. అయితే 'కెప్ట్ మెసేజ్' టూల్ డిజప్పియరింగ్ చాట్‌లో కూడా మెసేజ్‌లను ప్రిజర్వ్ చేస్తుంది.

■ సక్సెస్ స్టోరీ

క్లిక్‌కింగ్

పదమూడు సంవత్సరాల వయసులోనే కెమెరాతో స్నేహం మొదలుపెట్టిన ప్రణయ్‌కి, ఇప్పుడు ఆ కెమెరానే ప్రాణం. అరణ్యానికి సంబంధించిన అద్భుతదృశ్యాలను అమితంగా ఇష్టపడే ప్రణయ్ వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్నాడు. ఇంకా ఎన్నో అద్భుతాలు సాధించడానికి ఉత్సాహంగా ఉన్నాడు.....


ప్రణయ్ పటేల్

పదమూడు సంవత్సరాల వయసులో కెమెరాతో అనుబంధం పెంచుకున్నాడు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన ప్రణయ్ పటేల్. అది ఆ వయసుకు మాత్రమే పరిమితమైన ఉత్సాహమై ఉంటే వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్‌గా ప్రణయ్ అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకునేవాడు కాదు.

దేశవిదేశాల్లో అరణ్యానికి సంబంధించిన ఎన్నో అద్భుతమైన దృశ్యాలను ఫొటోలలో బంధించాడు. ఈ చిత్రాలు జాతీయ,అంతర్జాతీయ క్యాలెండర్‌లను అలంకరించాయి. అడవిలో ఫొటోగ్రఫీ అనేది అంతా వీజీ కాదు.

'మేము రెడీ. ఇక మీరు ఫొటో తీసుకోవచ్చు' అన్నట్లుగా ఉండదు అక్కడ. ఏ క్షణంలో ఏ అద్భుతం ఆవిష్కారం అవుతుందో తెలియదు. ఒళ్లంతా కెమెరా కన్నులై ఉండాలి. అడవి నాడి తెలిసిన ప్రణయ్‌కి ఈ విషయం తెలియనిదేమీ కాదు. అందుకే అడవిలోని అద్భుతదృశ్యాలను సమర్థవంతంగా పట్టుకోగలిగాడు.

'లొకేషన్‌లోకి ప్రవేశించిన వెంటనే బ్యాక్‌ప్యాక్ ఓపెన్ చేసి కెమెరా సెట్ చేసుకోవాలి. బోర్ కొట్టవచ్చు. అలసటగా అనిపించవచ్చు. అయితే మన లక్ష్యం...అద్భుత దృశ్యం అనే విషయాన్ని మరవకూడదు. ఓపికతో కూడిన నిరీక్షణ నన్ను ఎప్పుడూ నిరాశ పరచలేదు' అంటాడు ప్రణయ్.

దేశవిదేశాల్లో అరణ్యానికి సంబంధించిన ఎన్నో అద్భుతమైన దృశ్యాలను ఫొటోలలో బంధించాడు ప్రణయ్. ఈ చిత్రాలు జాతీయ, అంతర్జాతీయ క్యాలెండర్‌లను అలంకరించాయి.

ప్రణయ్ ఫొటోలతో రూపుదిద్దుకున్న 'ది వండర్‌ఫుల్ వైల్డ్‌లైఫ్ ఆఫ్ గుజరాత్' 'ది బేర్స్ ఆఫ్ కమ్‌చట్క–రష్యా' 'ది వైల్డ్ ఎర్త్ ఆఫ్ ఆఫ్రికా'... మొదలైన క్యాలెండర్‌లకు ఎంతో పేరు వచ్చింది. గుజరాత్ టూరిజం కార్పొరేషన్ అధికారిక ఫొటోగ్రాఫర్‌గా చిన్న వయసులోనే నియమించబడ్డాడు.

'ఫొటోగ్రాఫర్‌కు దృశ్యజ్ఞానమే కాదు శబ్దజ్ఞానం కూడా ఉండాలి' అంటున్న ప్రణయ్ శబ్దాల ద్వారా కూడా దృశ్యాలను ఊహించగలడు. వాటిని అందంగా ఛాయాచిత్రాలలోకి తీసుకురాగలడు.

తన వెబ్‌సైట్ ద్వారా ఎంతో మంది ఔత్సాహిక ఫొటోగ్రాఫర్‌లకు స్ఫూర్తిని, ఉత్సాహాన్ని ఇస్తున్న ప్రణయ్ అమెరికాతో సహా ఎన్నో దేశాల్లో జరిగిన ఫొటోఎగ్జిబిషన్‌లలో పాల్గొన్నాడు.

'వర్తమానం నుంచే కాదు గతం నుంచి కూడా ఎన్నో అద్భుత విషయాలను నేర్చుకోవచ్చు' అంటున్న ప్రణయ్ అలనాటి బ్లాక్ అండ్ వైట్ ఫొటోలలోని అద్భుతాలను ఆసక్తిగా విశ్లేషిస్తుంటాడు.

'ప్రతి ఫొటో ఒక కొత్త విషయాన్ని మనకు పరిచయం చేస్తుంది' అంటాడు ప్రణయ్.

స్కూల్‌బ్యాగ్ మోసుకెళ్లాల్సిన వయసులో కెమెరా బ్యాగు మోసుకెళుతున్న ప్రణయ్‌కి వెక్కిరింపులు ఎదురయ్యాయి. 'ఇక నీకు చదువు ఏం వస్తుంది!' అని ముఖం మీదే అన్నవాళ్లు కూడా ఉన్నారు.

అయితే ఆ మాటలు విని తాను ఎప్పుడూ బాధపడలేదు. వెనక్కి తగ్గలేదు. కెమెరాతో స్నేహం వీడలేదు. దేశవిదేశాలలో ప్రణయ్ చేసిన ఫొటోగ్రఫీ టూర్‌లు వంద దాటాయి.

'ప్రతి టూర్‌కు సంబంధించిన అనుభవాలను ఒక పుస్తకంగా రాసుకోవచ్చు' అని మురిసిపోతుంటాడు ప్రణయ్.

'కెమెరా పట్టుకోగానే అద్భుతాలు చోటుచేసుకోవు. పర్‌ఫెక్ట్ షాట్ కోసం రోజులే కాదు సంవత్సరం పాటు ఎదురుచూసిన సందర్భాలు కూడా ఉన్నాయి' అంటాడు ప్రణయ్. ఫొటోగ్రఫీ గురించి ఓనమాలు తెలియని వారే కాదు, ఆ విద్యలో కొమ్ములు తిరిగిన ఫొటోగ్రాఫర్‌లు కూడా ప్రణయ్‌ని ప్రశంసలతో ముంచెత్తున్నారు.

25 సంవత్సరాల ప్రణయ్ పటేల్ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆశిద్దాం.

యువర్స్

■ పెద్ద పండగ

పండగపూట పల్లెటూర్



* మీది పల్లెటూరు అయితే ఫరవాలేదు, నగరవాసులు అయితే మాత్రం ఈ మూడు రోజుల పండగలో ఒకరోజు పల్లె' టూర్'కు కేటాయించండి. ఎందుకంటే ఇది రైతుల పండగ. పంటల పండగ. పచ్చదనాల పండగ. పొలాల దగ్గరికి వెళ్లి ఆ గాలిని ఆస్వాదించండి. రైతులతో మాట్లాడితే ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు.
* పండగపూట కాస్త కొత్తగా కనిపించాలని ఎవరికి మాత్రం ఉండదు? దీని కోసం పండగరోజు పంచె,కండువా ధరించండి. ఎంత బాగున్నారో కదా!
* గాలిపటాలు ఎగిరేసే ముందు పక్షుల గురించి ఒక్కసారి ఆలోచించండి.

■ ఇంగ్లీష్ ఇడియమ్స్

కింగ్ ఆఫ్ ది హిల్



ఒక వ్యక్తి సమర్థతకు సంబంధించి ఏకాభిప్రాయంతో చెప్పే మాట....కింగ్ ఆఫ్ ది హిల్. ఫలాన ఆటలో ఫలానా వ్యక్తి ఛాంపియన్, ఫలానా రంగంలో ఫలానా వ్యక్తికి తిరుగులేని సామర్థ్యం ఉంది....ఇలాంటి సందర్భాల్లో ఉపయోగిస్తారు. ఇంగ్లాండ్‌లోని పిల్లల ఆటల్లో నుంచి పుట్టిన మాట ఇది. ఆటలో భాగంగా పిల్లవాడు ఒక ఎత్తయిన చోట కూర్చొని, తనను తాను రాజుగా ప్రకటించుకొని 'ఐయామ్ ది కింగ్ ఆఫ్ కాజిల్ అండ్ యూ ఆర్ డర్టీ' అని పాట అందుకుంటాడు. ఇతడిని కిందికి దించడానికి మిగతా పిల్లలు ప్రయత్నిస్తుంటారు.

■ గ్యాడ్జెట్ బజార్

డిజో స్మార్ట్ వాచ్



డిజో వాచ్ డి ప్రో, వాచ్ డి అల్ట్రా స్మార్ట్‌వాచ్‌లను మన దేశంలో విడుదల చేసింది. వీటికి సంబంధించిన కొన్ని వివరాలు..

డి ప్రో
స్క్రీన్: 1.85 అంగుళాలు **రిఫ్రెష్ రేట్:** 60 హెచ్‌జడ్ **పవర్:** డిజో డీఐ చిప్
మోడ్స్: 110 స్పోర్ట్స్ మోడ్స్
కలర్ ఆప్షన్స్: క్లాసిక్ బ్లాక్, సిల్వర్ గ్రే, లైటెనింగ్ బ్లూ **ధర:** ₹ 2,699

డి అల్ట్రా
స్క్రీన్: 1.78 అంగుళాలు **బ్యాటరీ:** 270 ఎంఏహెచ్ **రిజల్యూషన్:** 368×448 పిక్సెల్స్ **బ్యాటరీ:** 270 ఎంఏహెచ్ **మోడ్స్:** 100 ప్లస్ స్పోర్ట్స్ మోడ్స్ (ఇండోర్–ఔట్‌డోర్) **కలర్స్:** క్లాసిక్ బ్లాక్, సిల్వర్ గ్రే, ఓషన్ బ్లూ.

లెనోవా ట్యాబ్ పీ11 ప్రో జెన్2



రిజల్యూషన్: 1536×2560 పిక్సెల్స్ **బ్యాటరీ:** 8000 ఎంఏహెచ్
ఓఎస్/సాఫ్ట్‌వేర్: ఆండ్రాయిడ్ 12
● ఫింగర్‌ప్రింట్ సెన్సర్
మెమోరీ: 128 జీబి 4జీబి ర్యామ్ 128జీబి 6జీబి ర్యామ్ 256జీబి 8జీబి ర్యామ్

సినిమా

ప్రేమికుల దినోత్సవానికి టైటానిక్


● కేట్ విన్స్‌లెట్, లియోనార్డో

సినిమా లవర్స్‌కి.. అందులోనూ ప్రేమకథా చిత్రాల ప్రేమికులకు ఈ ప్రేమికుల దినోత్సవానికి సిల్వర్ స్క్రీన్‌పై 'టైటానిక్' ప్రత్యక్షం కానుంది. టైటానిక్ ఓడలో పరిచయం అయి, ప్రేమికులుగా దగ్గరయ్యే జాక్, రోజ్‌లు చివరికి ఓడ ప్రమాదంలో దూరమయ్యే ఈ విషాదభరిత ప్రేమకథ ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను అలరించింది. ప్రేమికులుగా లియోనార్డో డికాప్రియో, కేట్ విన్స్‌లెట్‌ల కెమిస్ట్రీని అంత సులువుగా ఎవరూ మరచిపోలేరు. జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన ఈ ఎవర్‌గ్రీన్ లవ్‌స్టోరీ విడుదలై 25 ఏళ్లయింది. ఈ సిల్వర్ జూబ్లీ సందర్భంగా ఈ చిత్రాన్ని హై క్వాలిటీతో మళ్లీ సిల్వర్ స్క్రీన్‌పైకి తీసుకు రావాలనుకుంటున్నారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా ప్రకటించి పోస్టర్‌ని, ట్రైలర్‌ని విడుదల చేసింది చిత్ర నిర్మాణ సంస్థల్లో ఒకటైన ట్వంటీయత్ సెంచురీ ఫాక్స్. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా వచ్చే నెల 10న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. 4కే ప్రింట్‌తో త్రీడీ వెర్షన్‌లో ఈ లవ్‌స్టోరీ కొత్త హంగులతో రావడానికి సిద్ధమవుతోంది. ఇక 1997 నవంబర్‌లో విడుదలైన 'టైటానిక్' సంచలన విజయం సాధించిన విషయం తెలిసిందే. ప్రపంచ వ్యాప్తంగా రూ. 13 వేల కోట్లకు పైగా కలెక్ట్ చేసి, రికార్డు సృష్టించింది. 2010లో జేమ్స్ కామెరూన్ అద్భుత సృష్టి 'అవతార్' విడుదలయ్యే వరకూ అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రం రికార్డ్ 'టైటానిక్'దే. కామెరూన్ తన సినిమా రికార్డ్‌ని తానే బద్దలు కొట్టడం విశేషం. ఇక ఆస్కార్ అవార్డ్స్‌లో 14 నామినేషన్లు దక్కించుకుని, 11 అవార్డులను సొంతం చేసుకున్న ఘనత కూడా 'టైటానిక్'కి ఉంది. ప్రేక్షకుల ఆదరణతో పాటు ఇలా పలు రికార్డులు సొంతం చేసుకున్న ఈ చిత్రం త్రీడీ వెర్షన్‌ని 2012లో విడుదల చేశారు. ఇప్పుడు మరింత క్వాలిటీతో 'టైటానిక్' రానుంది.

ఇన్నాళ్లకు మళ్లీ కన్నీళ్లు వచ్చాయి

- 'దిల్' రాజు


● జయసుధ, వంశీ పైడిపల్లి, 'దిల్' రాజు, శ్రీకాంత్

''వారిసు' చిత్రంపై తమిళ ప్రేక్షకులు చూపిన స్పందనకి వంశీ పైడిపల్లి, తమన్ ఏడ్చారు. 'బొమ్మరిల్లు' సినిమా చూస్తున్నప్పుడు వచ్చిన ఒక ఫోన్ కాల్‌తో నేను కూడా ఏడ్చాను.. మళ్లీ ఇన్నాళ్లకు 'వారిసు' చూస్తున్నపుడు కన్నీళ్లు వచ్చాయి. మా నమ్మకం నిజం కావడంతో వచ్చిన ఆనందభాష్పాలు అవి'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. దళపతి విజయ్, రష్మికా మందన్న జంటగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో తెరకెక్కిన ద్విభాషా చిత్రం 'వారిసు' (తమిళ్), 'వారసుడు' (తెలుగు). 'దిల్' రాజు, శిరీష్, పరమ్ వి. పొట్లూరి, పెరల్ వి. పొట్లూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 11న తమిళ్‌లో విడుదలైంది. తెలుగులో 14న 'వారసుడు' విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో 'దిల్' రాజు మాట్లడుతూ– ''చెన్నైలో 'వారిసు' ఆడుతున్న థియేటర్‌కి వెళ్లాను.. క్లైమాక్స్ పూర్తయ్యాక వంశీని అభిమానంతో హత్తుకున్నాను. ప్రేక్షకులు నిలబడి క్లాప్స్ కొట్టడంతో మేం పడ్డ కష్టాలు మర్చిపోయాం'' అన్నారు. వంశీ పైడిపల్లి మాట్లాడుతూ– ''ఒక మంచి కథని చెబితే ప్రేక్షకులు ఎంత గొప్పగా ఆదరిస్తారో 'వారిసు' మరోసారి నిరూపించింది. సినిమా అయిపోయిన తర్వాత ప్రేక్షకులు చప్పట్లు కొట్టారు. అల్లు అరవింద్‌గారు ఫోన్ చేసి 'వెయ్యి కోట్లు పెట్టినా రాని అనుభూతి ఇది' అని అభినందించారు'' అన్నారు. ''తమిళంలోలా తెలుగులోనూ ఈ సినిమా ఘనవిజయం సాధిస్తుంది'' అన్నారు నటి జయసుధ.

అదరగొట్టావ్ అబ్బాయ్ అన్నారు

- దేవిశ్రీ ప్రసాద్



''వాల్తేరు వీరయ్య'లో 'పూనకాలు లోడింగ్..' పాటలో బూరలాంటి వాయిద్యం ఉపయోగించి ఆ ట్యూన్‌ని కంపోజ్ చేశాను. అది చిరంజీవి గారికి నచ్చడంతో 'అదర గొట్టావ్ అబ్బాయ్' అన్నారు. నేను కంపోజ్ చేసిన ట్యూన్ ఒక ఎత్తు అయితే ఆయన డ్యాన్స్‌తో పాటని మరో స్థాయికి తీసుకెళ్లారు'' అని సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ అన్నారు. చిరంజీవి, శ్రుతీహాసన్ జంటగా హీరో రవితేజ కీలక పాత్రలో బాబీ కొల్లి (కేఎస్ రవీంద్ర) దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వాల్తేరు వీరయ్య'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజవుతోంది. ఈ సందర్భంగా దేవిశ్రీ ప్రసాద్ చెప్పిన విశేషాలు.

* చిరంజీవిగారి 'వాల్తేరు వీరయ్య', బాలకృష్ణగారి 'వీరసింహారెడ్డి' చిత్రాలు నిర్మించింది మా మైత్రీ మూవీస్ నిర్మాతలే (నవీన్ యెర్నేని, వై. రవిశంకర్). రెండు సినిమాలూ మావే కావడం, సంక్రాంతికి విడుదలవడం చాలా గర్వంగా ఉంది. సంగీతం విషయంలో ఎలాంటి ఒత్తిడి లేదు. ఏ సినిమాకైనా కథ ప్రకారమే మ్యూజిక్ చేస్తాం.. రెండు సినిమాలూ అద్భుతంగా ఆడాలి.
* బాబీతో నాకు చాలా అనుబంధం ఉంది. 'వాల్తేరు వీరయ్య'లో అన్ని పాటలూ హిట్ కావడానికి కారణం బాబీ కథ, ఆయన నాపై పెట్టుకున్న నమ్మకం. అన్నిటికీ మించి చిరంజీవిగారు మా ఇద్దరిపై పెట్టుకున్న నమ్మకం. చిరంజీవిగారితో సినిమా చేయాలనే బాబీ కల ఈ చిత్రంతో నెరవేరడం ఆనందంగా ఉంది. ఈ సినిమా చూసి చిరంజీవిగారితో 'నవ్విస్తూ ఏడిపించారు.. ఏడిపిస్తూ నవ్వించారు' అని అన్నాను. ఆయన 'ఎంత బాగా చెప్పావ్ మై బాయ్' అన్నారు.
* ఈ సినిమాలో రవితేజ, చిరంజీవిగారి సీన్స్‌కి క్లాప్స్ మామూలుగా ఉండవు. కంట తడితో, నవ్వుతూ క్లాప్స్ కొట్టే సీన్స్ చాలా ఉంటాయి. బాస్‌ని (చిరంజీవి) మనం ఎలా అయితే చూస్తూ పెరిగామో.. ఆ ఎలిమెంట్స్‌తో పాటు కొన్ని కొత్త ఎలిమెంట్స్ కూడా ఉన్నాయి. కామెడీ, డ్యాన్స్, ఫైట్స్.. అన్నీ కుమ్మేశారు. బాస్‌ని చాలా రోజుల తర్వాత పక్కా మాస్ ఎంటర్‌టైనర్‌లో చూస్తున్నాం.. ఎక్కడా తగ్గకూడ దని ప్రతి పాట విషయంలో జాగ్రత్తలు తీసుకున్నా.
* ప్రతి సినిమా సవాల్‌గానే ఉంటుంది. కానీ, ఒత్తిడిగా భావించకుండా సరదాగా చేస్తాను. నేను బాస్‌ని చూస్తూ పెరిగాను.. ఆయన్ని చూడగానే ఒక ఎనర్జీ వచ్చేస్తుంది. ఇందులో 'నువ్వు శ్రీదేవి..' పాటకి ఆయన స్క్రీన్‌పై ఎలా చేస్తారో ముందే ఊహించి, కంపోజ్ చేసి బాబీకి చూపించా.. అలాగే 'పూనకాలు లోడింగ్..' పాటలో చిరంజీవి, రవితేజగార్లు కనిపిస్తే ఎంత సందడిగా ఉంటుందో ఆ ఎనర్జీ అంతా పాటలో ఇచ్చేశాం.


● రవిశంకర్, గోపీచంద్, బాలకృష్ణ, తమన్, నవీన్

ఆ సన్నివేశాలు కంటతడి పెట్టిస్తున్నాయి

- బాలకృష్ణ

''సంక్రాంతికి విందు భోజనంలాంటి సినిమా 'వీరసింహారెడ్డి'. ప్రేక్షకులు, ఫ్యాన్స్.. ఇలా అందరి నుండి అద్భుతమైన ఆదరణ వస్తోంది'' అన్నారు బాలకృష్ణ. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో బాలకృష్ణ, శ్రుతీహాసన్ జంటగా నటించిన చిత్రం 'వీరసింహారెడ్డి'. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన వీర మాస్ బ్లాక్ బస్టర్ సక్సెస్ మీట్‌లో బాలకృష్ణ మాట్లాడుతూ– ''అఖండ'లాంటి హిట్ తర్వాత అలాంటి మరో సినిమాని ప్రేక్షకులు ఆశిస్తారు. అందుకు తగ్గట్టే నా అభిమాని అయిన గోపీచంద్ 'వీరసింహారెడ్డి'ని అద్భుతంగా తీశాడు. ఈ చిత్రంలో నాకు–వరలక్ష్మికి మధ్య వచ్చే అన్నా చెల్లెలి సన్నివేశాలు మహిళలనే కాదు మగవాళ్లనూ కంటతడి పెట్టిస్తున్నాయి'' అన్నారు. ''నా కెరీర్‌లో ఇది బ్లాక్ బస్టర్' అన్నారు గోపీచంద్. ''మా సినిమా తొలి రోజే 50 కోట్ల గ్రాస్ దాటుతోంది. ఇది పెద్ద రికార్డ్. బాలకృష్ణగారి మైలురాయి చిత్రానికి మేం నిర్మాతలు కావడం హ్యాపీ'' అన్నారు నిర్మాతలు.

క్రైమ్.. థ్రిల్

ఓ యువకుడిని క్రిమినల్ కేసులో పోలీసులు అరెస్ట్ చేస్తారు. అతన్ని విడిపించడానికి ఓ క్రిమినల్ లాయర్ కేసును టేకప్ చేస్తుంది. గురువారం హీరో రామ్‌చరణ్ విడుదల చేసిన 'అహింస' ట్రైలర్‌లో కనిపించిన సన్నివేశాలు ఇవి. మరోవైపు అదే ట్రైలర్‌లో ఆ యువకుడు, ఓ యువతి ప్రేమలో ఉన్న సీన్లు కనబడతాయి. దివంగత ప్రముఖ నిర్మాత డి. రామానాయుడు మనవడు, నిర్మాత సురేష్‌బాబు తనయుడు అభిరామ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'అహింస'. గీతిక హీరోయిన్‌గా లాయర్ పాత్రలో సదా నటించిన ఈ చిత్రానికి తేజ దర్శకుడు. ఈ క్రైమ్ థ్రిల్లర్ మూవీకి పి. కిరణ్ నిర్మాత. త్వరలో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: ఆర్పీ పట్నాయక్, కెమెరా: సమీర్ రెడ్డి.


● అభిరామ్


రియల్ లైఫ్ పాత్రలు గుర్తొస్తాయి

- దేవీ ప్రసాద్


● ప్రియా, సంతోష్, అనిల్, దేవీ ప్రసాద్

''బాలకృష్ణ, చిరంజీవిగార్ల సినిమాలతో (వీర సింహారెడ్డి, వాల్తేరు వీరయ్య) సంక్రాంతికి మళ్లీ ఒక కళ వచ్చింది. ఆ చిత్రాలతో పాటు మా సినిమా వస్తుండటం అదృష్టంగా భావిస్తున్నాం'' అని సంతోష్ శోభన్ అన్నారు. అనిల్ కుమార్ ఆళ్ల దర్శకత్వంలో సంతోష్ శోభన్, ప్రియా భవానీ శంకర్ నటించిన చిత్రం 'కళ్యాణం కమనీయం'. యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా రేపు రిలీజవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో సంతోష్ మాట్లాడుతూ– ''నాకు వెన్నుదన్నుగా ఉంటున్న నిర్మాతలు వంశీ, విక్కీ, అజయ్ అన్నలకు థ్యాంక్స్. ప్రియ నటన, కార్తీక్ సినిమాటోగ్రఫీ, శ్రవణ్ భరద్వాజ్ సంగీతం ఈ సినిమాకి ప్లస్'' అన్నారు. ''జీవితంలో నేర్చుకోవాల్సిన చాలా పాఠాలు 'కళ్యాణం కమనీయం'లో ఉన్నాయి. ఒక నిజాయితీ కథ, కథనాలతో చేసిన మూవీ ఇది'' అన్నారు అనిల్ కుమార్ ఆళ్ల. ''తెలుగులో నాకిది మొదటి సినిమా'' అన్నారు ప్రియా భవానీ శంకర్. ''ఈ సినిమా చూశాక ప్రేక్షకులకు వాళ్ల రియల్ లైఫ్‌లోని పాత్రలు, కొన్ని ఘటనలు గుర్తొస్తాయి'' అన్నారు దేవీ ప్రసాద్.

దేశం కోసం...


● రవీంద్ర

దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన సమరయోధుల చరిత్ర ఆధారంగా రూపొందిన చిత్రం 'దేశం కోసం భగత్ సింగ్'. గతంలో 'అన్నల రాజ్యం, నాగమనాయుడు, రాఘవేంద్ర మహత్యం' వంటి చిత్రాలను నిర్మించిన రవీంద్ర గోపాల ఈ చిత్రాన్ని స్వీయదర్శకత్వంలో నిర్మించారు. దేశభక్తి నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలో రవీంద్ర గోపాల, రాఘవ, మనోహర్ ప్రధాన పాత్రల్లో నటించారు. త్వరలో రిలీజ్ కానున్న ఈ చిత్రానికి సంగీతం: ప్రమోద్ కుమార్, కెమెరా: సీవీ ఆనంద్.